## ప్రొటెం మాజీ చైర్మన్‌ను పరామర్శించిన మాజీ మంత్రి హరీశ్‌రావు


భూపాల్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

రామచంద్రాపురం, డిసెంబర్ 18: ప్రొటెం మాజీ చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు సోమవారం పరామర్శించారు. ఇటీవల భూపాల్‌రెడ్డి బాత్‌రూంలో జారిపడి వెన్నుముకకు గాయమైంది. దీంతో ఆయన ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలిసిన మాజీ మంత్రి హరీశ్ రావు ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఎలక్షన్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## రైతుభరోసా కోసం ఎదురుచూపులు


నర్సాపూర్‌లో ఎస్బీఐ వద్ద క్యూ కట్టిన రైతులు

నర్సాపూర్, డిసెంబర్ 18: రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాలో రైతుభరోసా డబ్బులు వేసిందనే ఆశతో మండలంలోని రైతులు బ్యాంకులకు పరుగులు తీశారు. పెద్ద సంఖ్యలో క్యూ కట్టి డబ్బులు పడ్డాయో లేదో చెక్ చేసుకున్నారు. తీరా అకౌంట్‌లో డబ్బులు పడలేదని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో రైతులు నిరాశతో వెనుదిరిగారు. సోమవారం నర్సాపూర్‌లోని ఎస్బీఐ బ్యాంకుకు రైతులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. గత ప్రభుత్వ హయాంలో ఎకరా లోపు భూమి ఉన్నా మొదటి రోజే డబ్బులు పడేవని, ప్రస్తుతం ఇంకా పడలేవని పలువురు రైతులు వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా డబ్బులేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## జాతీయ స్థాయి హాకీ పోటీలకు రితేశ్ ఎంపిక


రితేశ్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 18: ఉమ్మడి మెదక్ జిల్లా తరపున అంతర్రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన సంగారెడ్డి జిల్లాకు చెందిన రితేశ్ జాతీయ స్థాయి హాకీ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ మేరకు రితేశ్‌ను డీఈవో ఎస్. వెంకటేశ్వర్లు, జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి అమూల్యమ్మ సోమవారం అభినందించారు. అండర్-14 విభాగంలో ఈ నెల 29 నుంచి జనవరి 1వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రితేశ్ పాల్గొంటాడని తెలిపారు. రితేష్‌ను హాకీ జట్టు కోచ్, మేనేజర్లు ఎండీ షర్ఫోద్దీన్, జయంతి కిష్టయ్య, సుభాష్ గౌడ్, రాజాగౌడ్, రామకృష్ణ అభినందలు తెలిపారు.

## కాళేశ్వరం భూసేకరణ ఆపాలంటూ పాదయాత్ర

నర్సాపూర్, డిసెంబర్ 18: కాళేశ్వరం కాల్వ కోసం ప్రభుత్వం చేపడుతున్న భూ సేకరణను తక్షణమే నిలిపేయాలని నర్సాపూర్ మండలంలో పలు గ్రామాలకు చెందిన రైతులు సోమవారం పాదయాత్ర చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేయడానికి నర్సాపూర్ మండలంలోని చిన్నచింతకుంట, పెద్దచింతకుంట, లింగాపూర్, మంతూర్, రెడ్డిపల్లి, బ్రాహ్మణపల్లి, శివంపేట్ మండలంలోని తిమ్మాపూర్, పిల్లుట్ల గ్రామాల రైతులు పెద్ద చింతకుంట జలహనుమాన్ ఆలయం నుంచి హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వరకు పాదయాత్రగా బయలుదేశారు. కార్యక్రమంలో రైతులు ప్యాట మహేశ్‌గౌడ్, నర్సింహారెడ్డి, కిష్టాగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీశైలం, రామకిషన్, కొండల్, కిషన్ నాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### 22న వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 18: ఉమ్మడి జిల్లా పరిధిలోని సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు సంబంధించిన అండర్ 17 వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి అమూల్యమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న ఉదయం 9 గంటలకు సంగారెడ్డి పట్టణంలోని శాంతి నగర్ సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల క్రీడాకారులు తమ ఒరిజినల్ బోనాఫైడ్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

# కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

- అధికారంలో లేమని అధైర్యపడొద్దు
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- కార్యకర్త కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు అందజేత


దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామానికి చెందిన కార్యకర్తకు చెక్కు అందజేస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్, డిసెంబర్ 18: కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, అధికారంలో లేమని ఎవరూ అధైర్యపడొద్దని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి భరోసా కల్పించారు. దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామానికి చెందిన పోతరాజు వెంకటేశ్ ఇటీవల మృతి చెందాడు. ఆయనకు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉంది. దీంతో బీమా ద్వారా రూ.2 లక్షల ఆర్థిక సాయన్ని బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి గ్రామ స్థాయి కార్యకర్తలే పట్టుకొమ్మలని, వారిని కడుపులో పెట్టుకుని చూసుకుంటామన్నారు. తనకు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించిన నాయకులు, కార్యకర్తలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తాను ఆపదలో ఉన్నప్పటికీ కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం ఎంతో శ్రమించారన్నారు. వారికి తాను ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు. నియోజకవర్గ స్థాయి అధికారులు, నాయకులు, మండల, గ్రామస్థాయి కార్యకర్తల సలహాలు, సూచనలు పాటిస్తూ దుబ్బాక నియోజక వర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ మల్లేశం, సొసైటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సంబగ యాదగిరి, మైనార్టీ సెల్ జిల్లా నాయకులు షాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఏడుపాయల్లో ఎమ్మెల్యే ‘గూడెం’ పూజలు


పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ ఈవో, సిబ్బంది

పటాన్‌చెరు/అమీన్‌పూర్, డిసెంబర్ 18: మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వన దుర్గామాతను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ఏడుపాయల దుర్గాభవానీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం వడక్‌పల్లి సర్పంచ్ లలిత మల్లేశ్ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన షెడ్డును ప్రారంభించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలన్నారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, కిష్టారెడ్డిపేట సర్పంచ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఏడుపాయల హుండీ ఆదాయం 53.36 లక్షలు

పాపన్నపేట, డిసెంబర్18: ఏడుపాయల హుండీ ఆదాయం 80 రోజులకు రూ.53 లక్షల 36 వేల 886లు వచ్చినట్లు ఆలయ పాలక మండలి చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమ పర్యవేక్షణకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ హాజరయ్యారు. సోమవారం భ్రమరాంబిక సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో గోకుల్ షెడ్‌లో హుండీ లెక్కింపు కొనసాగింది. బంగారం, వెండి ఆభరణాలు మినహా నగదు రూపేణ ఈ ఆదాయం వచ్చినట్లు వారు వెల్లడించారు.

## దివ్యాంగురాలికి వీల్ చైర్ అందజేత


వీల్‌చైర్‌ను అందజేస్తున్న అదనపు కలెక్టర్

మెదక్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): వెల్దుర్తి మండలంలోని కుకునూర్ గ్రామానికి చెందిన పోతుల మల్లేశ్ కూతురు పోతుల తేజశ్రీకి మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు వీల్ చైర్‌ను అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో తేజశ్రీ తన తండ్రి మల్లేశ్‌తో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లకు విన్నవించారు. తేజశ్రీ నడవలేని పరిస్థితిలో ఉందని, ఆమెకు 90శాతం వైకల్యం ఉందని, పేదరికంలో ఉన్నామని, సాయం చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. పూర్తిగా నడవలేని స్థితిలో ఉన్న తేజశ్రీని చూసి చలించిన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులతో మాట్లాడి వీల్ చైర్ అందించారు. కార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ, ఐసీడీఎస్ పీడీ బ్రహ్మాజీ పాల్గొన్నారు.

## ఇద్దరికి వరల్డ్ రికార్డ్స్ అవార్డులు


అవార్డు అందుకుంటున్న అమూల్యరెడ్డి

జిన్నారం, డిసెంబర్ 18: జిన్నారం మండలానికి చెందిన ఏర్పుల శ్రీనివాస్, దాసరి అమూల్యరెడ్డి పది వరల్డ్ రికార్డ్స్ అవార్డులు, సన్మానాలు అందుకున్నారు. హైదరాబాద్‌లోని భారతీయ విద్యా భవన్‌లో మయూరి ఆర్ట్స్ అధినేత రాధ, దత్తు ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ ఆఫ్ ది ఇయర్ 2023 కార్యక్రమంలో ఈ అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. సోలక్‌పల్లి గ్రామానికి చెందిన దాసరి అమూల్యరెడ్డి ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్‌తోపాటు పది వరల్డ్ రికార్డ్స్ అవార్డులను మయూరి ఆర్ట్స్ ద్వారా అందుకున్నారు.

## రేపు ఎంఎన్ఆర్ విద్యా సంస్థల గోల్డెన్ జూబ్లీ వేడుకలు

కంది, డిసెంబర్ 18: ఎంఎన్ఆర్ విద్యా సంస్థల గోల్డెన్ జూబ్లీ వేడుకలను బుధవారం నిర్వహిస్తున్నామని ఆ సంస్థల డైరెక్టర్ డాక్టర్ జి.రవి పిలుపునిచ్చారు. సోమవారం సంగారెడ్డిలోని ఎంఎన్ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వేడుకలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఎంఎన్ఆర్ విద్యా సంస్థలు స్థాపించి 50 ఏండ్లు అవుతున్న సందర్భంగా ఈ నెల బుధవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, మంత్రి దామోదర రాజనర్సింహ హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పార్వతిపతి, చీఫ్ లైబ్రరియన్ రఘునాథ్, పీఆర్వో దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

### రేపు జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికలు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 18: మెదక్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అధ్యక్ష కార్యదర్శులు అరునార్తి వెంకటరమణ, మధుసూదన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో బుధవారం ఉదయం 9 గంటలకు అండర్ -14, 16 విభాగాల్లో ఎంపికలు చేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు 2024 ఫిబ్రవరిలో గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొంటారని తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం వెంట తీసుకుని రావాలని సూచించారు. వివరాలకు 9963005540 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

## కృత్రిమ చేతులు అందజేత

రామాయంపేట, డిసెంబర్ 18: చేతులు లేకుండా తన పనులు చేసుకోలేని నిస్సహాయుడు రామాయంపేటకు చెందిన చంద్రి రవికి రెడ్ క్రాస్‌సొసైటీ ఆధ్వర్యంలో కృత్రిమ చేతులు అందజేసినట్లు మెదక్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర చైర్మన్, గవర్నర్ తమిళిసై, జిల్లా చైర్మన్ కలెక్టర్ రాజర్షిషా, హైదరాబాద్ జూబ్లీ హిల్స్ రోటరీ క్లబ్ అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో చేతులు అందజేశారు. చంద్రి రవి రామాయంపేట విద్యుత్ శాఖలో పనిచేస్తున్నాడు. రవి విద్యుత్ పనులు చేస్తున్న సమయంలో విద్యుత్ రావడంతో రెండు చేతులు మడిమెల వరకు తెగిపోయాయి. రెండు చేతులు కోల్పోయిన రవికి రెడ్‌క్రాస్ సొసైటీ, హైదరాబాద్ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో కృత్రిమ చేతులు అందించారు. సహకరించిన వారిలో జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ నిర్వాహకులు లక్ష్మి, శ్రీదేవి, రాజేశ్, గోపిరెడ్డి, నారాయణరావు ఉన్నారు.


పత్రాన్ని అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ, రోటరీక్లబ్ సభ్యులు